గిరిజన గ్రామాల్లో జ్వరాలు

- మంచాన పడ్డ గిరిజనులు
- పీహెచ్‌సీలో అందని వైద్య సేవలు
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న జ్వర బాధితులు



- వార్త 7వ పేజీలో..

పేదల ఇళ్ల నిర్మాణాలకు కదలిక



బుచ్చెయ్యపేట మండలం పెద్దమదీనా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు, నిర్మాణ సామగ్రి అందక ఆగిన ఇళ్ల నిర్మాణాలు

- జిల్లాలో 34,580 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- పనుల వేగవంతానికి గృహ నిర్మాణశాఖ ప్రణాళిక

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తరువాత గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిన అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గాడిలో పెట్టే పనిలో నిమగ్నమైంది. చంద్రబాబు నాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత సంక్షేమం, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిలిచిన పేదల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ అధికారులకు గతంలో జిల్లాల వారీగా ప్రారంభించిన గృహాలెన్ని?, వాటి పరిస్థితుల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతే కాకుండా ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించి వివిధ కారణాలతో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖాధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గృహ నిర్మాణ సంస్థ అధికారులు జిల్లాలో అరకొర పనులతో నిలిచిన 34,580 ఇళ్లను పూర్తి చేయాలని ప్రణాళికతో ముందు వెళుతుండడంపై గృహ నిర్మాణ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలందరికీ సొంతిల్లు నిర్మించి ఇస్తామని ప్రచార ఆర్భాటాలకు పోయినా క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. కేవలం సెంటు భూమికి పట్టా ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇల్లు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంది. గ్రామాల్లో జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా పూర్తి కాని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అయితే పనులు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించలేదు. జగనన్న కాలనీల పేరుతో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పి ఎక్కడా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయలేదు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇవ్వాల్సిన సిమెంట్, ఇటుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రిని సకాలంలో అందించలేదు. దీంతో ఎక్కడికక్కడ ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.

ఆగిన నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా..

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పేరుతో 56,580 గృహాలు మంజూరు చేసింది. యూనిట్ ధర రూ.1.8 లక్షలుగా నిర్ణయించింది. వీటిలో కేవలం 22 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేయగలిగారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు అందక, ప్రభుత్వం అందించాల్సిన సిమెంట్, ఇసుక, ఇనుము పంపిణీలో జరిగిన జాప్యం కారణంగా పేదల ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం గత నాలుగేళ్లలో జిల్లాలో రూ.1,018 కోట్లు మంజూరు చేసినా కేవలం రూ.537 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఇందులో సుమారు రూ.5 కోట్లకు పైగా గృహ లబ్ధిదారులకు బకాయిలు పేరుకుపోయాయి. ఎన్నికల ముందు వీరంతా ఇళ్ల పనులు నిలిపి వేశారు. కాగా కూటమి ప్రభుత్వం జిల్లాలో అర్ధాంతరంగా నిలిచిన గృహ నిర్మాణాలను ముందుగా పూర్తి చేయాలని భావిస్తోంది. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులకు విడుదల చేసింది. దీని ప్రకారం జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై మండల స్థాయిల అధికారులతో సమీక్ష నిర్వహించి వివరాలు సేకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో నిలిచిన గృహ నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గతంలో చెల్లించాల్సిన బిల్లు బకాయిల వివరాలను సేకరించి ఆయా లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతున్నారు. గతంలో నిర్దేశించిన మేరకు ప్రతి లబ్ధిదారుడికి అందాల్సిన సిమెంట్, ఇసుక, ఇనుము పంపిణీ చేసి గృహ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే వదిలేసిన ఇళ్లను కూటమి ప్రభుత్వం పూర్తిచేసి పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా అడుగులు వేయడంపై గృహ నిర్మాణ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు

కలెక్టర్‌కు హోం మంత్రి అనిత పలు సూచనలు




సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 11న ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులతో రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమీక్ష నిర్వహించారు. సీఎం జిల్లా పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు పలు సూచనలు చేశారు. జిల్లాలో పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను సీఎం పరిశీలిస్తారని తెలిపారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జిల్లాకు వస్తున్నందున అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతం చేయాలని ఆమె సూచించారు. పోలవరం పనులు పూర్తిచేసి రైతులను ఆదుకొనేందుకు చంద్రబాబు తన వంతు కృషి చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో అతి త్వరలోనే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తవుతాయన్నారు. ఈ నెల 11న ఉదయం 11 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో ఎస్.రాయవరం మండలం దార్లపూడి చేసుకుంటారని తెలిపారు. అనంతరం భోగాపురం పర్యటనకు వెళతారని చెప్పారు. అక్కడ విమానాశ్రయ పనులను పరిశీలించిన అనంతరం విశాఖ చేరుకొని పలు కార్యక్రమాలకు హాజరైన అనంతరం విజయవాడ వెళతారని మంత్రి తెలిపారు. సమావేశంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఏఎస్పీ విజయ్‌భాస్కర్, డీఆర్‌వో శ్రీనివాసరావు, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరామ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ పరిశీలన

ఎస్.రాయవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 11న మండలంలోని దార్లపూడి సమీపంలో అసంపూర్తిగా ఉన్న పోలవరం ఆక్విడెక్టు, ఎడమ కాలువను పరిశీలించనున్న నేపథ్యంలో హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో జయరాం తదితరులు మంగళవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మొదట అక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న పోలవరం ఎడమ కాలువను పరిశీలించి, అనంతరం అక్కడ ఆర్ అండ్ బీ రోడ్డు వద్ద అసంపూర్తిగా ఉన్న ఆక్విడెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నెల రోజులు కూడా గడవక ముందే చంద్రబాబు ఇక్కడి పోలవరం ఎడమ కాలువను, అసంపూర్తిగా ... మిగతా 8వ పేజీలో

సీఎం రాక రేపు



- ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన
- అనంతరం భోగాపురం పయనం
- విమానాశ్రయం పనులపై సమీక్ష
- అక్కడ నుంచి ఏపీ మెడ్‌టెక్‌జోన్‌కు రాక
- కొత్త భవనాల ప్రారంభం
- విమానాశ్రయంలో అధికారులతో సమావేశం

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి చేరుకుంటారు. అక్కడ పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలిస్తారు. దార్లపూడి నుంచి 12 గంటలకు బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం వెళతారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతర్జాతీయ విమానాశ్రయం పనులపై సమీక్షిస్తారు. అక్కడి నుంచి 1.50 గంటలకు బయలుదేరి ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు చేరుకుంటారు. 2.30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సీఐఐ వర్చువల్ సమావేశంలో పాల్గొంటారు. రెండు కొత్త భవనాలను ప్రారంభిస్తారు. అక్కడి సిబ్బందితో ముచ్చటిస్తారు. సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో సాయంత్రం ఆరు గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 6.10 గంటలకు విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ

టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్‌గా సాయికాంత్‌వర్మ

- ఇన్‌చార్జి కమిషనర్‌గా విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు బాధ్యతలు



విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు బదిలీ అయ్యింది. ఆయన్ను ప్రభుత్వం ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు జీవీఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించాలని పేర్కొంటూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

గత ఏడాది ఏప్రిల్ 15న జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీఎం సాయికాంత్‌వర్మ వైసీపీ నేతలకు వీరవిధేయునిగా పనిచేశారనే విమర్శలు ఉన్నాయి. వివాదాస్పదమైన 'హయగ్రీవ' భూముల్లో నిర్మాణాలకు గత కమిషనర్లు అనుమతి ఇవ్వకుండా ప్లాన్‌ను పలుమార్లు వెనక్కి పంపించేశారు. కానీ సాయికాంత్ వర్మ మాత్రం హైకోర్టులో జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకున్నానని చెప్పి ప్లాన్‌ను అప్రూవ్ చేసేయడం చర్చనీయాంశమైంది. అలాగే రుషికొండలో శ్రీరామ్ ప్రాపర్టీస్‌కు ఎదురుగా వైసీపీ నేత విజయసాయిరెడ్డి కుమార్తె విల్లాలు నిర్మిస్తున్న ఐకానికా ప్రాజెక్టుకు ప్లాన్ జారీచేయడంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. పెదజాలరిపేటలోని భూమి దసపల్లా రాణి వారసులకు చెందినదని పేర్కొంటూ ఆ భూమిపై టీడీఆర్ కొట్టేసేందుకు వైసీపీ నేతలు పథకం రచిస్తే..దాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సాయికాంత్‌వర్మ తన వంతు సహకారం అందించారనే ఆరోపణలు ఉన్నాయి.

దసపల్లా హిల్స్‌లో సర్క్యూట్‌హౌస్ జంక్షన్ నుంచి నౌరోజీరోడ్డు జంక్షన్‌కు వంద అడుగులు మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ కమిషనర్ హోదాలో సాయికాంత్‌వర్మ నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, విపక్షాలు అడ్డుపడడంతో టీడీఆర్ జారీ ప్రక్రియ ఆగిపోయింది. ఇలా చాలా విషయాల్లో ఆయన నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయి.

ఫార్మా యాజమాన్యాల బరితెగింపు

తరచూ రసాయన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్న వైనం

- ఇటీవల ఉప్పుటేరులో అధిక సంఖ్యలో చేపలు మృత్యువాత
- తాజాగా పెదముషిడివాడ బచ్చలి చెరువులో రసాయన వ్యర్థాల డ్రమ్ముల డంపింగ్
- ప్రజల ప్రాణాలతో చెలగాటం
- ఆందోళన చెందుతున్న జనం



స్థానిక మల్లోడి గెడ్డలో విడిచిపెట్టిన ఫార్మా వ్యర్థ జలాలు (ఫైల్ ఫొటో)

పరవాడ, జూలై 9:

ఫార్మా యాజమాన్యాలు బరి తెగించి తరచూ ఫార్మా రసాయనాల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్నాయి. దీని వల్ల సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం తమకు శాపంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా నామమాత్రంగా తనిఖీలు చేసి ఆ తరువాత పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో ఫార్మా వ్యర్థ జలాలు కలవడంతో ఇటీవల అధిక సంఖ్యలో చేపలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఫార్మా యాజమాన్యాలు గెడ్డల ద్వారా వ్యర్థ రసాయనాలను విడిచిపెట్టడంతో పరవాడ మల్లోడి గెడ్డ ఫార్మా వ్యర్థాలతో నిండిపోయింది. రెండు రోజుల క్రితం పెదముషిడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో గల బచ్చల చెరువులో ఫార్మా వ్యర్థాలతో నిండిన డ్రమ్ములను గుర్తు తెలియని వ్యక్తులు విడిచిపెట్టి వెళ్లిపోవడం తీవ్ర కలకలం రేపింది. అసలు దీనికంతటికి కారణం రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ఉదాసీన వైఖరి వల్ల ఫార్మా యాజమాన్యాలు బరితెగిస్తున్నాయని మండిపడుతున్నారు. కాగా ఫార్మా పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలను ఫార్మాసిటీలో రాంకీ యాజమాన్యం ఏర్పాటు చేసిన కోస్టల్ ఎన్విరాన్‌మెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)కు తరలించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా యాజమాన్యాలు చర్యలు చేపట్టడం లేదు. వ్యర్థాలను రాంకీకి అప్పగిస్తే అందుకు డబ్బులు యాజమాన్యాలు చెల్లించాల్సి ఉంది. అయితే ఇదంతా ఖర్చుతో కూడుకున్న పని. దీంతో రాంకీలో పనిచేస్తున్న దిగువస్థాయి సిబ్బంది కొన్ని ఫార్మా యాజమాన్యాలతో కుమ్మక్కైనట్టు తెలిసింది. రాంకీ యాజమాన్యం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆ సంస్థ దిగువ స్థాయి అధికారులు దాటించి యథేచ్ఛగా వ్యర్థాలను బయటకు విడిచిపెడుతున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

ఫార్మా రసాయన వ్యర్థాల డంపింగ్‌పై కేసు నమోదు

లంకెలపాలెం: ప్రమాదకర ఫార్మా రసాయన వ్యర్థాలతో కూడిన డ్రమ్ములు డంపింగ్ చేసిన వ్యవహారంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ)అధికారులు మంగళవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలావున్నాయి. పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో గల బచ్చల చెరువులో గత ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రమాదకర ఫార్మా రసాయన వ్యర్థాలను డ్రమ్ములతో డంపింగ్ చేశారన్నారు. డ్రమ్ముల్లోని విష వ్యర్థాలను చెరువు గర్భంలోకి విడిచిపెట్టారని, దీని కారణంగా దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు భూగర్భ జలాలు కలుషితం అయ్యే ప్రమాదముందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఫార్మా వ్యర్థాలను డ్రమ్ములతో ఇష్టానుసారంగా పడవేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు చేపడతామని సీఐ వెల్లడించారు.

తూతూమంత్రంగా పీసీబీ తనిఖీలు

పరవాడ ప్రాంతంలో యథేచ్ఛగా ఫార్మా వ్యర్థాలను బయటకు విడిచిపెడుతున్న నేపథ్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తూతూ మంత్రంగా నమూనాలు సేకరిస్తున్నారు. సేకరించిన నమూనాలను ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం దానికి సంబంధించిన కారణాలను బయటకు వెల్లడించడంలో పీసీబీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతంలో పరవాడ పెద్ద చెరువులో ఫార్మా వ్యర్థాలు కలవడంతో చేపలు మృత్యువాత పడ్డాయి. పీసీబీ అధికారులు వచ్చి నీటి నమూనాలను సేకరించారు. ఇప్పటికీ ఆ నివేదికను వెల్లడించలేదు. అలాగే 15 రోజుల ... మిగతా 8వ పేజీలో

11న డిగ్రీ పరీక్షలు

- బంద్ కారణంగా వాయిదా పడిన పరీక్షల నిర్వహణ
- షెడ్యూల్ విడుదల చేసిన ఏయూ అధికారులు



విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల బంద్ నేపథ్యంలో వాయిదాపడిన డిగ్రీ పరీక్షను ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు ఆంధ్ర విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల నాలుగో తేదీన బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్‌ఎం విద్యార్థులకు రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే, నీట్‌లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆరోజు బంద్‌కు పిలుపు నిచ్చాయి. దాంతో ఏయూ అధికారులు పరీక్షలను వాయిదా వేశారు. ఆ రెండు పరీక్షలను 11న నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ పరీక్షను 11న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెమిస్టర్ పరీక్షను అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గొల్లలపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

- రాత్రి వేళలో మామిడి మొక్కలు నాటిన ఆక్రమణదారులు

సబ్బవరం, జూలై 9: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో విలువైన ప్రభుత్వ భూమిని స్థానికులు కొంత మంది ఆక్రమించు కున్నారు. ఆ భూమిని రాత్రి వేళలో చదును చేసి మామిడి మొక్కలు నాటారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ ఆదేశాల మేరకు వీఆర్వో పూడి శేషు మంగళవారం ఆక్రమిత భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లలపాలెం సర్వే నంబరు 1/1లో సుమారు 80 నుంచి 90 సెంట్ల భూమిని స్థానికులు కొందరు ఆక్రమించుకున్నారన్నారు. సదరు ప్రభుత్వ భూమికి ఆనుకొని అటవీ భూమి ఉందన్నారు. ఇందులో కూడా సుమారు 20 అడుగుల మేర ఆక్రమణకు గురైందని తెలిపారు. ఆక్రమిత భూమిలో సోమవారం రాత్రి ఆక్రమణదారులు మామిడి మొక్కలు నాటారన్నారు. అటవీ అధికారులకు సమాచారం అందడంతో వారు కూడా వచ్చి ఆక్రమిత భూమిని పరిశీలించి వెళ్లారన్నారు. బుధవారం సమగ్ర సర్వే చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆక్రమణలకు తెగబడినవారిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని డీటీ వెంకట్ హెచ్చరించారు.



గొల్లలపాలెం సర్వే నంబరు 1/1లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య



మరిసా అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, జూలై 9: అప్పుల బాధ భరించలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మరిసా అప్పలనాయుడు (45)కు భార్య లక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. అప్పలనాయుడు సుమారు ఎకరా సొంత భూమితో పాటు కొంత కౌలుకు తీసుకుని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నారు. ఇటీవల ఇంటి నిర్మాణానికి కొంత అప్పుచేశారు. వ్యవసాయంతో పాటు ఇంటి నిర్మాణానికి సుమారు రూ.15 లక్షలు అప్పు చేయడంతో వడ్డీలు పెరిగిపోయాయి. సాగు కలిసి రాకపోవడంతో భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పొలంలోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన తోటి రైతులు కుటుంబీకలకు సమాచారం ఇవ్వగా, వారు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు రిఫర్ చేయగా, పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పలనాయుడు మంగళవారం మృతిచెందారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో జ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న పొట్టంగి సంతోష్



వేలంబయలులో జ్వరంతో బాధపడుతున్న జన్నిసామాలమ్మ

- గ్రామ, పీహెచ్‌సీ స్థాయిల్లో అందని వైద్య సేవలు
- మలేరియా పరీక్షలు చేయడం లేదంటున్న గిరిజనులు
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న జ్వర బాధితులు

దేవరాపల్లి, జూలై 9: మండలంలోని గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలాయి. గిరిజనులకు సరైన వైద్య సేవలు అందక మంచాన పడుతున్నారు. కొందరు దేవరాపల్లి పీహెచ్‌సీకి వెళ్లినా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలోని గర్భింగి, చింతలపూడి, వాలాబు, తామరబ్బ గ్రామాల్లో జ్వరాలతో గిరిజనులు మంచాన పడ్డారు. గిరిజనులు జ్వరంతో దేవరాపల్లి పీహెచ్‌సీకి వచ్చినా వైద్య సిబ్బంది పరీక్షలు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. మందులు లేవంటూ ప్రైవేటు ఆస్పత్రులకు పంపుతున్నారని తాటిపూడికి చెందిన జన్ని దేముడు ఆరోపించారు. తాటిపూడి, వేలం బయలు, చింతలపాలెం, నేరళ్లపూడి, సమ్మె, బోడిగరువు, తామరబ్బ, విప్పగరువు, వాలాబు గ్రామాల్లో జ్వరాలు ప్రబలాయని గిరిజనులు తెలిపారు. తాటిపూడి, వేలంబయలు, చింతలపాలెంకు చెందిన జన్ని గంగన్నదొర (47), జన్నిసామాలమ్మ (40), తాటిపూడి, వేలం బయలుకు చెందిన పొట్టంగి సంతోష్(26), మజ్జిహారిక(7), చింతలపాఎంకు చెందిన జన్నిదివ్య(10), జన్ని దేముడు(35)తోపాటు పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. అయితే ప్రైవేటు వైద్యం చేసుకొనే స్థోమత లేక జ్వరాలతో ఇంటి వద్దే మంచాన పట్టారు. క్షేత్రస్థాయిలో జ్వర బాధితులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. దేవరాపల్లి పీహెచ్‌సీకి వచ్చినా అదే పరిస్థితి ఉందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. జ్వర బాధితులకు మలేరియా పరీక్షలు చేయడం లేదని వారంటున్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి బీటీ దొర తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సేవలు అందక గిరిజనులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారని ఆయన తెలిపారు.

క్రైం... crime news

'ఫార్మా' బస్సు ఢీకొని యువకుడి మృతి

కశింకోట, జూలై 9: లారస్ ఫార్మా కంపెనీకి చెందిన బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రమేశ్ బాబు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం కొడవటిపూడి గ్రామానికి చెందిన కె.రాజేశ్(27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే సోమవారం రాత్రి విశాఖపట్నం వెళ్లేందుకు రాజేష్, అతని తండ్రి కె.దొరబాబు ద్విచక్రవాహనంపై కోటవురట్ల నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలో కన్నూరుపాలెం రోడ్డులో లాలంకొత్తూరు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారస్ ఫార్మా కంపెనీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న రాజేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో హుటాహుటిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఎనిమిది ఇళ్లలో చోరీలు

- ఓ ఇంట్లో తులమున్నర బంగారం, రూ.20వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్లూస్ టీం

కశింకోట, జూలై 9: మండలంలోని నూతనగుంట పాలెం(ఎన్‌జీపాలెం) పంచాయతీలో సోమవారం రాత్రి వరుసగా ఎనిమిది ఇళ్లల్లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి సీఐ వినోద్ బాబు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గ్రామ శివారున ఉన్న ఎస్సీ కాలనీకి చెందిన పిల్లి సుందరరావు, సతకంపట్టు రోడ్డులో ఉన్న కోరుకొండ మారయ్య, కలిగట్ల మహాలక్ష్మినాయుడు, చిక్కాల రమణ, కళ్ళం గౌరమ్మ, బొండా వరలక్ష్మి, చిక్కాల రమణమ్మ, అగ్రహారం శ్రీనివాసరావులకు చెందిన ఇళ్ల తాళాలను దొంగలు పగులగొట్టి ఇంట్లోని దుస్తులు, వెండి సామాన్లను చిందరవందర చేశారు. బాధితుల్లో కొందరు బయటకు వెళ్లడం, మరికొందరు పొరుగూరు వెళ్లడంతో ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాగా పిల్లి సుందరరావుకు చెందిన ఇంటి తలుపు గడియ పగులగొట్టి ఉండడంతో విశాఖలో ఉన్న ఆయనకు ఫోను ద్వారా స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సుందరరావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ చోరీలో సుందరరావుకు చెందిన ఒక తులమున్నర బంగారం, రూ.20వేలు నగదు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

అప్పన్నను దర్శించుకున్న ఎలమంచిలి ఎమ్మెల్యే



కప్పస్తంభం వద్ద ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దంపతులు

సింహాచలం, జూలై 9: వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఉదయం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ ఆనందకుమార్ అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని,బేడామండప ప్రదక్షిణల తరువాత అంతరాలయంలో ఎమ్మెల్యే గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు.గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

తెలుగుదేశంతోనే ప్రజా సంక్షేమం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘన సత్కారం



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

విశాఖపట్నం, జూలై 9: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల ఎన్నికైన పార్టీ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు సరైన గుర్తింపునిచ్చేది తెలుగుదేశమేనని అన్నారు. ఐదేళ్లుగా ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇక నుంచి అలాంటి సమస్య ఎదురవకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. కార్యకర్తలను ప్రభుత్వంలో భాగస్వాములుగా చేయడానికి వీలుగా నామినేటెడ్ పదవుల్లో వారికి స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉత్తరాంధ్రకు అధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేశారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ రైల్వేజోన్ సాధన, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషిచేస్తామన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక వనరులు లేకుండా చేసిందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ వైసీపీపై విసుగెత్తిన ప్రజలు అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు మాట్లాడుతూ అధికారానికి అలవాటు పడిన నాయకులు ఇప్పుడు టీడీపీ వైపు వస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాతే వారంతా ఊపిరి పీల్చుకున్నారన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు



స్థానిక ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి మంగళవారం భక్తులకు వరాహావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. **- అనకాపల్లి టౌన్**

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

కోనాం జలాశయం గేట్లు మరమ్మతులకు ప్రతిపాదనలు

- రూ.65లక్షలకు పైగా విద్యుత్ బిల్లులు చెల్లింపునకు చర్యలు
- ఇరిగేషన్ ఈఈ త్రినాథం



గేట్లు లీకేజీలను పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం



కోనాం జలాశయాన్ని పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం

చీడికాడ, జూలై 9: పాలవెల్లి కోనాం జలాశయం గేట్లు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు నీటిపారుదల శాఖ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) త్రినాథం తెలిపారు. మంగళవారం కోనాం జలాశయంలో నెలకొన్న సమస్యలను ఇరిగేషన్ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడుతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా స్పిల్‌వే గేట్లు లీకేజీలను పరిశీలించారు. అనంతరం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జలాశయం ఎగువ కాలువ దగ్గర ఉన్న మెయిన్‌గేటు, ఎగువ, దిగువ కాలువల గేట్లు మరమ్మతు పనులకు ఇప్పటికే రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. కోనాం జలాశయానికి సంబంధించి రూ.65 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా పదేళ్ల క్రితమే జలాశయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. జలాశయం వద్ద సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. అలాగే పెదకళ్యాణం ఆనకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. జలాశయం పరిధిలోని మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.40లక్షలు ఎంపీ గ్రాంటు మంజూరు కాగా ఇంకనూ రూ.30లక్షల పనులు చేయాల్సి ఉందన్నారు. మర్లగుమ్మి, శిరిజాం ఆనకట్ల వద్ద తాత్కాలిక పనుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయన వెంట ఏఈలు సీహెచ్.జయరాం, ద్వారపురెడ్డి భార్గవకుమార్, సిబ్బంది భాష, షేక్ రసూల్ ఉన్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమ కట్టడాలపై దర్యాప్తు చేపట్టాలి

- కూటమి నేతల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నేతలు

బుచ్చెయ్యపేట, జూలై 9: వడ్డాది జగనన్న కాలనీలోని మూడు లేఅవుట్లలో అక్రమంగా చేపట్టిన ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలపై దర్యాప్తు చేపట్టాలని కూటమి నేతలు దాడి సూర్యనాగేశ్వరరావు, కోరుకొండ సూరి అప్పారావు, దొండా నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గ్రామంలో మూడు జగనన్న లేఅవుట్లలో 279 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో 25 మంది అనర్హులుగా అధికారులు గుర్తించి వారికి హౌసింగ్ కాలనీ ఇళ్లు మంజూరు నిలిపివేశారు. అయితే వారికి మంజూరైన స్థలాలను విక్రయించారని కూటమి నేతలు ఆరోపించారు. ఈ స్థలాల అమ్మకాల్లో వైసీపీ నాయకుడు చక్రం తిప్పారన్నారు. ఈయనతో ప్రభుత్వ ఉద్యోగులు కుమ్మక్కు కావడంతోనే జగనన్న లేఅవుట్‌ల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కాలనీకి ఆనుకుని ఉన్న రక్షిత నీటి పథకం ట్యాంకు సమీపంలో 20 సెంట్లు ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా, ఏడుగురు అక్రమంగా భవన కట్టడాలు చేస్తున్నా, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కట్టడాలపై విచారణ చేపట్టి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

టిడ్కో గృహ సముదాయంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టిడ్కో గృహ సముదాయం వద్ద దెబ్బతిన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న టిడ్కో అధికారులు

ఎలమంచిలి, జూలై 9: ఎట్టకేలకు టిడ్కో గృహ సముదాయంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'టిడ్కో ఇళ్లల్లో ఉండలేం' శీర్షికన ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. టిడ్కో అధికారులు కాలనీ పరిసరాలను, దెబ్బతిన్న డ్రైనేజీలను పరిశీలించారు. వీటితో పాటు మంచినీటి బోర్లు, మోటార్లను పరిశీలించారు. నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు మూడు కొత్త మోటార్లను తీసుకువచ్చి మంగళవారం ఒకటి అమర్చినట్టు కాలనీవాసులు తెలిపారు. మరో రెండు మోటార్లు బుధవారం అమరుస్తామని సిబ్బంది చెప్పారన్నారు.



మంచినీటి బోర్లకు అమర్చడానికి తీసుకొచ్చిన కొత్త మోటార్లు

అవకతవకలకు పాల్పడిన సొమ్ము రికవరీకి చర్యలు

- సామాజిక తనిఖీల్లో రూ.9.55 లక్షలు దారి మళ్లినట్టు నిర్ధారణ
- ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమలత

పాయకరావుపేట, జూలై 9: గత ఆర్థిక సంవత్సరంలో పాయకరావుపేట మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా జరిగిన ఉపాధి పనులపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల్లో 11 పంచాయతీల్లో వెలుగుచేసిన అవకతవకల్లో రూ.9,55,980ల నిధులు దారిమళ్లినట్టు నిర్ధారించి బాధ్యుల నుంచి రికవరీకి రంగం సిద్ధం చేస్తున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ హేమలత తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాయకరావుపేట మండలంలోని 24 పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.8,23,04,118ల ఖర్చుతో చేపట్టిన 1,254 పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అవకతవకలపై గత శనివారం పాయకరావుపేటలో డ్వామా పీడీ ఇ.సందీప్ ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించిన విషయం తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా మండలంలో నామవరం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.4,89,017ల నిధులు పక్కదారి పట్టించినట్టు నిర్ధారించడంతో ఆ సొమ్మును అతని నుంచి రికవరీ చేయనున్నామన్నారు. అదేవిధంగా ఈదటం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.3,06,724లు, గోపాలపట్నం పంచాయతీలో సీనియర్ మేట్ నుంచి రూ.23,205లు, శ్రీరాంపురం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.54,505లు, పెదరాంభద్రపురంలో సీనియర్ మేట్ నుంచి రూ.37,112లు రికవరీ చేయనున్నామన్నారు. పాల్మన్‌పేట పంచాయతీలో రూ.28,293లు, మంగవరంలో రూ.1,000లు, పాత్రేరులో రూ.1,530లు, కందిపూడిలో రూ.11,000లు, కుమారపురంలో రూ.11,938లు, రాజగోపాలపురంలో రూ.1,000లు, రాజవరంలో రూ.1,600లు, కేశవరంలో రూ.1,904లు ఆయా పంచాయతీలో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నామని ఆమె తెలిపారు.

ఇసుక డిపో వద్ద పటిష్ఠ బందోబస్తు



ఇసుక అమ్మకాలను పర్యవేక్షిస్తున్న మైన్స్‌శాఖ ఏడీ సుబ్బారాయుడు

నక్కపల్లి, జూలై 9: నక్కపల్లి ఇసుక డిపో వద్ద వున్న ఇసుక నిల్వలు తరలిపోకుండా అధికార యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 26 వేల టన్నుల ఇసుక నిల్వలు నక్కపల్లి డిపో వద్ద వున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి అధికారికంగా ఇసుక అమ్మకాలు ప్రారంభమయ్యాయి. జేసీ జాహ్నవి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం నక్కపల్లి ఇసుక డిపో వద్ద సీసీ కెమెరాలను అమర్చింది. ఇసుక నిల్వలు వున్న ప్రాంతంలో నలువైపులా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బందిని కూడా ఇక్కడ నియమించారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇసుక అమ్మకాలను మైన్స్ శాఖ ఏడీ సుబ్బారాయుడు పరిశీలించారు. ప్రస్తుతం టన్ను ఇసుక రూ 1,225లు చొప్పున విక్రయిస్తున్నారు. నక్కపల్లి డిపో వద్ద వున్న పాత ఇసుక నిల్వల అమ్మకాలు పూర్తయితే, ఆ తరువాత ఇసుక ధర బాగా తగ్గుతుందని భావిస్తున్నారు.

ఆరేళ్ల తరువాత మళ్లీ సీఎం హోదాలో బాబు రాక

- ఘన స్వాగతం పలికేందుకు సన్నాహాలు



ఎస్.రాయవరం మండలం గుడివాడలో 2018 జూలై 31న సీఎం హోదాలో గ్రామదర్శిని సభను నిర్వహిస్తున్న చంద్రబాబు (ఫైల్)

నక్కపల్లి, జూలై 9: ఆరేళ్ల తరువాత ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గానికి మళ్లీ ఈ నెల 11న రానున్నారు. 2014లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత అదే సంవత్సరం ఆగస్టులో నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో ఆయన పర్యటించారు. 2018 జూలై 31న గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు సీఎం హోదాలో ఎస్.రాయవరం మండలం గుడివాడ పంచాయతీ పరిధిలో పర్యటించారు. దాదాపు 6 గంటల పాటు ఆయన గుడివాడలోనే ప్రజలతో మమేకమయ్యారు. మళ్లీ ఇప్పుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే పాయకరావుపేట నియోజకవర్గానికి ఆయన ముఖ్యమంత్రి హోదాలో రానున్నారు. ఈ నెల 11న ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద అసంపూర్తిగా నిలిచిన పోలవరం ఎడమ ప్రధాన కాలువను సీఎం చంద్రబాబు పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం పలికేందుకు హోం మంత్రి నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉచిత ఇసుక పాలసీతో నెరవేరనున్న పేదల సొంతింటి కల

- మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీతో పేదల సొంతింటి కల నెరవేరనుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టి రెండు నెలల్లోనే అమలు చేయడం గొప్ప విషయమన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపించి ఇసుక కుంభకోణం ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని ఆరోపించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్‌జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణం దెబ్బతినకుండా ఉచిత ఇసుక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బోడి వెంకటరావు, కోట్ని రామకృష్ణదొర, మళ్ల గణేష్, సాలాపునాయుడు, శివన్నారాయణ, తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

కశింకోట, జూలై 9: స్థానిక రాజీవ్ గాంధీ ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం అడ్మిషన్లకు బుధవారం కౌన్సెలింగ్ జరగనున్నదని ప్రిన్సిపాల్ కర్రి శివ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరేందుకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలన్నారు. కళాశాలలో 4 బ్రాంచీలు ఉన్నాయని, వాటిలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఉన్నాయని, వీటిలో 30 సీట్లు చొప్పున ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9063297220, 08924220377, 9505504220 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన కోరారు.

97.10 మీటర్లకు చేరిన కోనాం నీటిమట్టం

- 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- వృథాగా పోతున్న 30 క్యూసెక్కులు



కోనాంలో జలాశయంలో కళకళలాడుతున్న నీరు

చీడికాడ, జూలై 9: మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకీ పెరుగుతుం డడంతో ఖరీఫ్ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏజెన్సీలో వారం రోజులుగా వర్షాలు కురుస్తుం డడంతో గెడ్డల ద్వారా జలాశయానికి అధికంగా వర్షపు నీరు చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25మీటర్లు కాగా, మంగళవారం ఉదయానికి 97.10 మీటర్లకు చేరుకుంది. కాగా, ఇన్‌ఫ్లో 120 క్యూసెక్కులు కాగా.. రెండు గేట్లు ద్వారా 30 క్యూసెక్కులు వృథాగా పోతున్నది. అయితే గత ఏడాది ఇదేరోజు నాటికి 95.25మీటర్లు నీటిమట్టం ఉందని ఏఈ సీహెచ్.జయరాంపడాల్ తెలిపారు.

ఇసుక అవకతవకలపై టీడీపీ ఫిర్యాదు

నర్సీపట్నం, జూలై 9 : గబ్బాడ ఇసుక డిపోలో ఇసుక నిల్వలు, అక్రమ రవాణాపై విచారణ చేయించాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ కలెక్టర్, ఆర్డీవో, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మైనింగ్ అధికారులకు తెలియని ఇసుక లెక్కలు, వివరాలు మాజీ ఎమ్మెల్యే గణేశ్‌కి ఎలా తెలిశాయో తేల్చాలని కోరారు. ఇసుక డిపోలో గబ్బాడకు చెందిన నాగరాజు అనే వ్యక్తి డబ్బులు వసూలు చేసి వేరే వక్తులకు పంపేవాడని, ఆ డబ్బులు ఎవరికి వెళ్లాయో విచారణ చేయాలని, బ్యాంకు ఖాతా ఎవరిదో తేల్చాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

» సొంత నిధులతో పక్కా ఇళ్ల నిర్మాణానికి హామీ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరాపు

అచ్యుతాపురం, జూలై 9 : వెదురువాడ అగ్ని బాధితులకు తన సొంత నిధులతో పక్కాభవనాలు నిర్మిస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మంగళవారం వెదురువాడ అగ్నిబాధితులను ఆయన పరామర్శించారు. సోమవారం మెదురువాడలో కారుకుండి అప్పల రాజు, రమణల కమ్మల పాకలు అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. అన్నదమ్ములైన వీరిరువురూ నిరుపేదలు, భార్య భర్తలిరువురూ ప్రతిరోజూ కూలిపనికి వెళ్తారు.వీరు కూలిపనికి వెళ్లిన సమయంలో సోమవారం రెండు కమ్మల పాకలు దహనం అయి సర్వం కోల్పోయి కేవలం కట్టుబట్టలతో మిగిలారు. దీంతో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు రెండు కుటుంబాలకు పాత పంచాయతీ కార్యాలయంలో వసతి ఏర్పాటు చేశారు. వంటపాత్రలు, బట్టలు, చాపలు, దుప్పట్లు కొనిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయకుమార్ మంగళవారం రెండు కుటుంబాలను కలిసి వారి రోదనకు చలించిపోయారు. రెండు కుటుంబాలకు పక్కా భవనాలు (శ్లాబ్ హౌస్) తన సొంత నిధులతో కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. రెండు భవనాలకు అంచనాలు రూపొందించాలని వీఆర్వో శశికుమార్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట మోటూరు శ్రీవేణి, కొయ్య మహాలక్ష్మి, సీరా శ్రీను తదితరులు ఉన్నారు.

పేదలకు మేలు కోసమే ఉచిత ఇసుక విధానం



జీవో కాపీని చూపుతున్న ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల తదితరులు

ఎలమంచిలి, జూలై 9 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపడంతో పాటు ప్రగతికి బాటగా నిలుస్తుందని ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. మంగళవారం ఎలమంచిలి మండలం పురుషోత్తపురంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీతో అన్ని వర్గాల ప్రజల్లోనూ ఆనందం కనిపిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇసుక మాఫియా చేయడం ద్వారా ఆ పార్టీ నేతలు రూ.కోట్లకు పడగలెత్తారని విమర్శించారు. పేద ప్రజలు ఆర్థికంగా చితికిపోయారన్నారు. ప్రజారంజక పాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, ఐ.టీడీపీ ఇన్‌చార్జ్ రాజాను వెంకునాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ పూడి రామకృష్ణ, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భారీ ఊరట : మాజీ ఎమ్మెల్యే పీలా



మాట్లాడుతున్న పీలా గోవింద్

తుమ్మపాల : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రజలకు భారీ ఊరట లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 43 తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, గొంతిన శ్రీనివాసరావు, బీఎస్ఎంకే జోగి నాయుడు, పోలారపు త్రినాథ్, నారపిన్ని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఏపీటీఎఫ్ సభ్యత్వాల నమోదు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

నక్కపల్లి, జూలై 9 : నక్కపల్లి మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వాల నమోదు ప్రక్రియను సంఘ ప్రతినిధులు వేగవంతం చేశారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు (వేణు), రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, జిల్లా ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, వై.కృష్ణ, సీహెచ్ అప్పలరాజు, యేసుదేవుడు, కిల్లాడ శ్రీనివాసరావు, సూర్యారావు తదితరులు జానకయ్యపేట, నక్కపల్లి, పెదబోదిగల్లం, కేజీబీవీ, గొడిచెర్ల, వేంపాడు తదితర పాఠశాలలకు చెందిన టీచర్లను కలిసి సభ్యత్వాల నమోదుచేపట్టారు. జీవో 117, సీపీఎస్ రద్దు కోసం తమ సంఘం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రతినిధి వెంకటపతిరాజు చెప్పారు.

సర్పంచ్ పార్థివ దేహానికి కూటమి నేతల నివాళి

రాంబిల్లి, జూలై 9 : మండలంలోని లాలంకోడూరు సర్పంచ్, ప్రముఖ న్యాయవాది లాలం రమణమూర్తి పార్థీవ దేహానికి మంగళవారం టీడీపీ, జనసేన, వైసీపీలకు చెందిన నేతలు నివాళులు అర్పించారు. సర్పంచ్ రమణమూర్తి ఆదివారం గుండె పోటుతో మృతి చెందిన సంఘతి తెలిసిందే.. టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు రాజాన రమేష్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జనసేన పార్టీ అచ్యుతాపురం మండలశాఖ అధ్యక్షులు భైలపూడి రామదాసు, వైసీపీ రాంబిల్లి మండల కన్వీనర్ పి.కిషోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు, పలువురు నేతలు, అధికారులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు రమణమూర్తి పార్థీవ దేవాహన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భగా రమణమూర్తి కూటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మంగళవారం స్వగ్రామమైన లాలంకోడూరులో రమణమూర్తి అంత్యక్రియలును జనసందోహం నడుమ ఘనంగా నిర్వహించారు.

8 మందికి నేత్ర శస్త్రచికిత్సలు

అనకాపల్లి టౌన్, జూలై 9 : స్థానిక ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా నేత్ర శస్త్రచికిత్సలు చేశారు. సోమవారం ఆస్పత్రిలో కంటి పరీక్షలకు 45 మంది హాజరు కాగా వారికి నేత్ర వైద్య సహాయకులు పరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. దీంతో మంగళవారం డాక్టర్ కె.మల్లేశ్వరరావు ఎనిమిది మందికి ఐవోఎల్ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్లు చేయించుకున్న వారికి రొటేరియన్లు కె.మల్లేశ్వరరావు, కె.అరుణ ఐదు రోజులకు సరిపడా మందులను అందజేశారని రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు.

ఫార్మా యాజమాన్యాల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

క్రితం ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో చేపలు మృత్యువాత పడ్డాయి. దానికి సంబంధించిన నీటి నమూనాలను పీసీబీ అధికారులు సేకరించారు గానీ ఇప్పటికీఆ నివేదిక బహిర్గతం చేయలేదు.

పది రోజుల క్రితం పరవాడ మల్లోడిగెడ్డలో ఫార్మా వ్యర్థ జలాలను విడిచిపెట్టడంతో నీటి నమూనాలను సేకరించినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదు. పీసీబీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇటీవల కాలంలో ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం ఫార్మా యాజమాన్యాలకు అలవాటుగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా వ్యర్థాలు బయటకు రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

అసంపూర్తిగా దార్లపూడి ఆక్విడెక్టు నిర్మాణం

» 11న పరిశీలనకు చంద్రబాబు
» రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
» టీడీపీ హయాంలో 154.86 కోట్ల నిధులు మంజూరు
» 90 శాతం నిర్మాణం పూర్తి
» వైసీపీ హయాంలో ఆగిపోయిన పనులు



అసంపూర్తిగా నిలిచి పోయిన అక్విడెక్టు నిర్మాణం

ఎస్.రాయవరం, జూలై 9 : మండలంలోని దార్లపూడిలో వరహానది మీదుగా సాగుతున్న పోలవరం ఎడమ కాలువకు చెందిన ఆక్విడెక్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. 2017-18 మధ్య టీడీపీ హయాంలో ఈ నిర్మాణానికి రూ 154.86 కోట్ల నిధులు మంజూరు చేయడమే కాకుండా వెంటనే నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. సుమారు 90 శాతం వరకు నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి.

అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఏదో కాస్త పనులు జరిగినప్పటికీ తరువాత కాంట్రాక్టర్ వదిలేయడంతో ఆక్విడెక్టు నిర్మాణ పనులు ముందుకు కదలకుండా పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 11న ఉమ్మడి విశాఖ జిల్లాకు రాకలో భాగంగా ముఖ్యంగా ఇక్కడి ఆక్విడెక్టును పరిశీలించడానికి వస్తున్నారు. ఆక్విడెక్టు నిర్మాణంతో పాటు పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులు కూడా పూర్తి అవుతాయంటూ పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



తాళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్, టీడీపీ నేతలు

ఘనంగా విజయోత్సవ సభ

ఎలమంచిలి, జూలై 9 : మండలంలోని పురుషోత్తపురంలో మంగళవారం కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. టీడీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావు కూటమి పార్టీ శ్రేణుల సమక్షంలో సంబరాలు జరుపుకున్నారు. ముందుగా గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపుతో పాటు నేతలు దర్శించుకున్నారు. అనంతరం నేతలంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు కాండ్రకోట చిరంజీవి, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, రాజాన నారాయణమ్మ, రాజాన వెంకునాయుడు, ఇత్తంశెట్టి రాజు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న ఏఈవో

అచ్యుతాపురం, జూలై 9 : విత్తనాలు శుద్ధి చేసిన తర్వాతే నాటాలని వ్యవసాయ విస్తరణాధికారి కేబీ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం వెదురువాడలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై విత్తనాలు సిద్దంగా ఉన్నాయని, కావలసిన రైతులు తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు మహాలక్ష్మి, సీరా శ్రీను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం : మండలంలోని బాటజంగాపాలెంలో రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణ రైతులకు ఖరీఫ్ రాయితీ విత్తనాలు అందజేశారు ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.నర్సింహ, గ్రామ పెద్దలు గొర్లి నూకరాజు, పోతల శ్రీనివాస్, కె.వెంకట్, బి.శ్రీనివాస్, పడాల అప్పలరాజు, వీఏఏ హరీష్, కార్యదర్శి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పూడిమడక తీరంలో పోలీసుల రక్షణ కవచ్

అచ్యుతాపురం, జూలై 9 : సముద్ర మార్గంలో ఉగ్రవాదులు వస్తే ఎలా వారిని పట్టుకోవాలనే దానిపై స్థానిక పోలీసులకు ఉన్నతాధికారులు శిక్షణ ఇచ్చారు. బుధ, గురువారాల్లో పూడిమడక తీరంలో వీరు మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. సముద్ర మార్గంలో ఉగ్రవాదుల రూపంలో పోలీసులే ఏదో ఒక ప్రాంతానికి చేరుతారు. వీరిని రెడ్ ఫోర్స్ అంటారు. వీరిని ఛేదించి పట్టుకొనే వారిని బ్లూఫోర్స్ అంటారు. జిల్లా పోలీసు యంత్రాంగం రెడ్, బ్లూఫోర్స్ సిబ్బందిని సిద్ధం చేశారు., గురు, శుక్రవారాల్లో సముద్ర మార్గంలో ఉన్న రెడ్ ఫోర్స్‌ని భూభాగంలో ఉన్న బ్లూఫోర్స్ గుర్తించి పట్టుకోవాలి. ఇందుకు సంబందించిన శిక్షణను అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, పూడిమడక మెరైన్ సీఐ గోవిందరావు, అచ్యుతాపురం, పరవాడ సీఐలు బుచ్చిరాజు, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పశుగ్రాసంపై అవగాహన సదస్సు

కశింకోట, జూలై 9 : మండలంలోని కన్నూరుపాలెంలో రైతులకు మంగళవారం పశుగ్రాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పశుగ్రాసం ప్రాధాన్యాన్ని వివరించార. పశుగ్రాసాలు పెంచుకోవడం వల్ల ఆర్థికంగా ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పశుగ్రాసం బయటకు కొనుగోలు చేయకుండా నేరుగా పచ్చిమేతను సాగు చేసుకున్నట్లైతే పశువుల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. దీంతో నిర్ణీత సమయానికి యదకు రావడమే కాకుండా పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. రైతులు ఈ సూచనలు పాటించడం ద్వారా పాల దిగుబడి పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్నూరుపాలెం, తీడ, అచ్చెర్ల, తాళ్లపాలెం పాడి రైతులు, పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం. దయానా, సిబ్బంది పాల్గొన్నారు.

దిమిలిలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాంబిల్లి, జూలై 9 : మండలంలోని దిమిలి గ్రామాన్ని మంగళవారం సాయంత్రం ఎలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సందర్శించారు. వీధుల్లో కాలువలు, పేరుకుపోయిన చెత్తనిల్వలు, పంటకాలువల పరిశీలించారు. ప్రధాన వీధుల్లో పర్యటించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, మరుగుపోయి నిలిచి దుర్వాసన వెలువడుతుందని, దోమల బెడద ఉంటోందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే సుందరావు అధికారులతో మాట్లాడారు. వెంటనే ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని చెప్పారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలు గుర్తించి నివేధిక ఇవ్వాలన్నారు. పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రజల నుంచి కూడా సహకారం కావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పలుశాఖ అధికారులు, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు వి.దినేష్‌బాబు, గ్రామ మాజీ సర్పంచ్ కోటాపు వడ్డీకాసులు, నేతలు కరణం శ్రీహరి, దల్లమ్మదేవి, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అక్రమాలపై నిగ్గు తేల్చాల్సిందే

» తుమ్మపాల గ్రామసభలో పలువురి డిమాండ్



సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న గ్రామ నాయకులు



వాగ్వాదానికి దిగిన వారిని వారిస్తున్న పోలీసులు

తుమ్మపాల, జూలై 9 : గత ప్రభుత్వ పాలనలో మేజరు పంచాయతీ తుమ్మపాలలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాల్సిందేనని మంగళవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామ నాయకులు పట్టుబట్టారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభ రసాభాసగా సాగింది. కూటమి నాయకులు, పంచాయతీ పాలకవర్గం, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఒక దశలో వేదికపై కూర్చునే నాయకుల అంశంపై ప్రోటోకాల్ పాటించడం లేదంటూ పలు వర్గాలు పాలకవర్గం సభ్యులపై తిరగబడ్డారు. దీంతో పోలీసులు చొరవ తీసుకుని శాంతింపజేశారు. అనంతరం సాగిన సభలో గ్రామ నాయకుడు, బీఎస్ఎన్ఎల్ అడ్వయిజ్ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థ ఘోరంగా తయారైందని ఆరోపించారు. పేదల భూములను కావాలనే వైసీపీ నాయకుల సూచనలతో ఆన్‌లైన్‌లో రెడ్‌మార్కులో ఉంచేవారని విమర్శించారు. దీంతో రైతులు భూముల క్రయవిక్రయాల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేదన్నారు. రెవెన్యూ అధికారులకు లంచాలు ముట్టచెబితే రెడ్‌మార్కులను తొలగించేవారని లేదంటే కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా రైతులను తిప్పించుకునేవారని ఆరోపించారు. ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గత ఐదేళ్లలో గ్రామకంఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు సందిన సునీల్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో చాలా అవకతవకలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. లంచాలు తీసుకుని అనర్హులకు ఇళ్ల స్థలాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ కర్రి బాబి మాట్లాడుతూ నాడు - నేడు పథకంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుమ్మపాల జంక్షన్‌లో గల డంపింగ్‌యార్డును తరలించే విషయమై ఉన్నతాధికారులతో చర్చించాలని సూచించారు. సచివాలయాల్లో పూర్తి స్థాయి నియామకాలు చేపట్టాలని కోరారు. గ్రామసభలో వెల్లడించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు వివరించారు.

ఈ సమావేశంలో పంచాయతీ ఈవో ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించకుంటే చర్యలు

» సచివాలయ సిబ్బందికి జడ్సీ అయ్యప్పనాయుడు హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, జూలై 9 : సచివాలయాల్లో సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు స్పష్టం చేశారు. జోనల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో ఆయన సమావేశమయ్యారు. సచివాలయాల్లోని రికార్డులన్నింటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎవరైనా దురుసుగా వ్యవహరించినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ వసూళ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలు తెరిచినందున విద్యార్థులకు అవసరమయ్యే వివిధ సర్టిఫికెట్లు ఎప్పటికప్పుడు విద్యార్థులకు అందేలా చూడాలని, పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌వో ఎల్. సురేష్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు



దార్లపూడి సమీపంలో ఉన్న పోలవరం ఎడమ కాలువను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

... 5వ పేజీ తరువాయి

ఉన్న ఆక్విడెక్టును పరిశీలించడానికి వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో భాగంగా దార్లపూడి సమీపంలో అసంపూర్తి ఉన్న ఆక్విడెక్టు వద్ద ఉన్న తుప్పలను తొలగించడం, అడ్డరోడ్డు నుంచి ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో ఉన్న గోతులకు మరమ్మతులు చేయడం వంటి అన్ని పనులను వేగవంతం చేసి ముఖ్యమంత్రి పర్యటకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అన్ని శాఖల అధికారులకు హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రాకకు సంబంధించి హెలికాప్టర్ దిగేందుకు దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రదేశాన్ని అనిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలవరం, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, రెవెన్యూ తదితర శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీ మోహనరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఎన్ఎంఎంఎస్‌కు విజయస్వాతి ఎంపిక



విజయస్వాతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి, జూలై 9 : మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గంగిరెడ్డి విజయస్వాతి ఎన్ఎంఎంఎస్ 2023 పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఉపకార వేతనాలకు ఎంపికైనట్టు హెచ్ఎం అప్పారావు మంగళవారం చెప్పారు. ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు మండలం పరిధిలో తమ హైస్కూల్‌కు చెందిన విజయస్వాతి మాత్రమే ఎంపికైనట్టు చెప్పారు. ఈ పథకం కింద అందే ఆర్థికసాయం ఆ బాలిక ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన విజయస్వాతి ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. పాఠశాలలో మంగళవారం ఈ బాలికను హెచ్ఎం సహా ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

పరవాడ, జూలై 9 : ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూలుకు చెందిన ఐదుగురు విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. జి.ధార్మిక శివాన్విత, రెడ్డి తేజ, టీఎస్ రణధీర్, ఎం.కార్తీక్, ఎం.హిమప్రభాస్‌లు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలతో పాటు కోచ్ హరినాథ్‌రెడ్డిని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్ అభినందించారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అచ్యుతాపురం, జూలై 9 : పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ, అతిసార, మలేరియా, చికున్‌గున్యా వంటి రోగాలు రాకుండా కాపాడుకోవచ్చని మడుతూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం మడుతూరులో విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కలుషిత నీటితో పాటు ఆరుబైట తినుబండారాలు తినకూడదని ప్లకార్డులతో వీరు ర్యాలీని నిర్వహించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటించాలన్నారు.

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న లీగల్ సర్వీస్ కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 9 : హెల్మెట్ ధరించడంపై మంగళవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు సముదాయాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా రింగురోడ్డు జంక్షన్ వరకు, అక్కడ నుంచి తిరిగి న్యాయస్థానాల సముదాయాల వరకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో న్యాయమూర్తులు రమేష్, బీవీ విజయలక్ష్మి, ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు, పట్టణ సీఐ జి. శంకరరావు, న్యాయవాదులు దివాకర్, కుసుమ, ప్రసాద్‌పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

కొత్తూరు, జూలై 9 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా రైతులకు అవసరమైన పండ్ల మొక్కల పంపిణీని మంగళవారం కుంచంగా గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా మండల ఇంజనీరింగ్ ప్రతినిధి రమణ మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయంలో మొక్కలపై రైతులు, గ్రామస్థులు, ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించామన్నారు. పండ్ల మొక్కలు అవసరమైన వారు పంచాయతీ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లెల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శైలజపాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

రాంబిల్లి, జూలై 9 : మండలంలోని ధారభోగాపురంలో మంగళవారం పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టారు. గ్రామంలో చెత్తనిల్వలు పేరుకుపోయి, కాలువల్లో మురికినీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లేది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ నాయకులు ఉరిటి నానాజీ అధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని కాలువల్లో దగ్గరుండి బ్లీచింగ్‌ను పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

కొళాయి కనెక్షన్లకు అవకాశం



కొళాయి కనెక్షన్లపై ఆరా తీస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సుదీశన

కృష్ణాదేవిపేట, జూలై 9 : మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో మిగిలి ఉన్న వీధుల్లో ఇంటింటికీ కొత్త కొళాయి కలెక్షన్ కోసం గొలుగొండ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈమేరకు గొల్లపేట శివారులో గల వీధుల్లో ఇంటింటి కొలాయి కనెక్షన్ ఏర్పాటుపై గొలుగొండ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సుదీశన, సిబ్బందితో పరిశీలించి అంచనా వేశారు. ఇంటింటి కులాయి కలెక్షన్ పనులు త్వరలో చేపడతామని జేఈఈ తెలిపారు. ప్రజలందరికీ తాగునీరు అందించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక మాజీ ఉప సర్పంచ్ గొంప వాసు తదితరులు పాల్గొన్నారు.

బోధన నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి

▸▸ విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్



ఉపాధ్యాయులకు సూచలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్


నర్సీపట్నం, జూలై 9 : ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని విద్యాశాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ సూచించారు. మంగళవారం నర్సీపట్నం ఐదు రోడ్ల కూడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ అబ్జర్వేషన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతులలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల అభ్యసనా సామార్థ్యం పెంపొందించాలని సూచించారు.ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగు పరుచుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, కిట్టు మాస్టారు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం



అధ్వాన స్థితిలో ఉన్న రాచపల్లి పశు వైద్య కేంద్రం

మాకవరపాలెం, జూలై 9 : మండలంలోని రాచపల్లి గ్రామంలో ఉన్న పశువైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతుండడంతో వైద్య సిబ్బంది లబోదిబోమంటున్నారు. భవనం పూర్తిగా పడిపోయే స్థితిలో ఉండటంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కొన్నిసార్లు స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది గాయాల పాలవుతున్న సంఘటనలు ఉన్నాయి. వర్షం వస్తే చాలు కేంద్రంలో ఉన్న పశువులకు సంబంధించిన మందులు పూర్తిగా తడిచి ముద్దవుతున్నాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని వైద్య సిబ్బంది, రైతులు కోరుతున్నారు.



ఇదీ పైకప్పు పరిస్థితి



ఊరటనిచ్చిన వర్షం

మాకవరపాలెం, జూలై 9 : మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతవరణంలో మార్పులు రావడంతో ముసురుతో ఉండి మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం పడింది. ఇప్పటికే వరివిత్తనాలు వేసి రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు



దార్లపూడి సమీపంలో ఉన్న పోలవరం ఎడమ కాలువను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

... 5వ పేజీ తరువాయి

ఉన్న ఆక్విడెక్టును పరిశీలించడానికి వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో భాగంగా దార్లపూడి సమీపంలో అసంపూర్తి ఉన్న ఆక్విడెక్టు వద్ద ఉన్న తుప్పలను తొలగించడం, అడ్డరోడ్డు నుంచి ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో ఉన్న గోతులకు మరమ్మతులు చేయడం వంటి అన్ని పనులను వేగవంతం చేసి ముఖ్యమంత్రి పర్యటకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అన్ని శాఖల అధికారులకు హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రాకకు సంబంధించి హెలికాప్టర్ దిగేందుకు దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రదేశాన్ని అనిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలవరం, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, రెవెన్యూ తదితర శాఖల జిల్లా అధికారులు, డీఎస్పీ మోహనరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి పాల్గొన్నారు.

తపాలా సేవలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయులు

నాతవరం, జూలై 9 : నాతవరం మండలం చమ్మచింతలో హెల్పింగ్ హోర్సు ట్యూషన్ నిర్వహిస్తున్న విద్యార్థులకు పోస్టల్ సేవలపై అవగహన సదస్సు నిర్వహించారు. పోస్టాఫీసు పథకాల గురించి పిల్లలకు వివరించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే పొదుపు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్టు మాస్టారు సాంబశివరావు, శ్రేయోభిలాషీ సంస్థ వ్యవస్థాపకులు నానాజీ టీచర్లు శ్రీదేవి, అనూష పాల్గొన్నారు.

పోషక పశుగ్రాసంతో బహు ప్రయోజనాలు

▸▸ పశు సంవర్ధక శాఖ ఏడీఏ డా.రాంబాబు



పాడిరైతుతో మాట్లాడుతున్న వెటర్నరీ ఏడీఏ డా. రాంబాబు

గొలుగొండ, జూలై 9 : పాడి పశువులకు పోషకాలు కలిగిన పశుగ్రాసంతోనే అధిక పాల దిగుబడి సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ ఏడీఏ డా.రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని మంగళవారం పలుగ్రామాల్లో పాడిరైతులతో పాలదిగుబడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాకలపాడులో ఏర్పాటైన పాడిరైతుల సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. డివిజన్‌లో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీవరకూ పాడిపశువులు కలిగిన రైతులకు పశుగ్రాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసం పెంపకం, నిల్వలు చేపట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఐదు నుంచి ఆరు లీటర్లు పాలు దిగుబడి ఇచ్చే పశువులకు దాణా అవసరం లేకుండా పశుగ్రాసంతోనే పోషించవచ్చని తెలిపారు. రైతులకు అన్ని మండల కేంద్రాల్లో గల వెటర్నరీ, ఆర్‌బీకేల్లో కార్యాలయాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగావున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ వెటర్నరీ అధికారి రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం : ప్రభుత్వం 75 శాతం రాయితీపై పశుగ్రా విత్తనాలు సరఫరా చేస్తుందని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ డబ్ల్యూ రాంబాబు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసాలు పెంచే విధానం, నిల్వ చేసే విధానం రైతులకు వివరించారు. పశు గ్రాస విత్తనాలను ప్రభుత్వం రాయితీ పై సరఫరా చేస్తుందని తెలిపారు. జిల్లాలో 11 టన్నులు జొన్న, మూడు టన్నులు మొక్క జొన్న, 10 టన్నులు అలసంద విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధం



మాకవరపాలెం, జూలై 9 : మండలంలో చినరాచపల్లిలో మంగళవారం ఉదయం పిగుడు పడటంతో పశువుల పాక దగ్ధం అయింది. వివరాలిలా ఉన్నాయి. చినరాచపల్లి గ్రామానికి చెందిన చింతల బాబులు అనే రైతు మంగళవారం ఉదయం పాకలో ఉన్న పశువులను బయట కట్టారు. అనంతరం వర్షం రావడంతో వారంతా వేరొక పశువుల పాకలో తలదాచుకున్నారు. అయితే వర్షంతో పాటు కొంత దూరంలో ఉన్న మరో పశువులపాకపై పిడుగు పడగా ఒక్కసారిగా పశువుల పాకపై మంటలు వ్యాపించాయి. పాక మొత్తం కాలి బూడిదైంది. పాకలో పాడిగెదెలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఫార్మా యాజమాన్యాల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

క్రితం ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో చేపలు మృత్యువాత పడ్డాయి. దానికి సంబంధించిన నీటి నమూనాలను పీసీబీ అధికారులు సేకరించారు గానీ ఇప్పటికీ ఆ నివేదిక బహిర్గతం చేయలేదు. పది రోజుల క్రితం పరవాడ మల్లోడి గెడ్డలో ఫార్మా వ్యర్థ జలాలను విడిచిపెట్టడంతో నీటి నమూనాలను సేకరించినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదు. పీసీబీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇటీవల కాలంలో ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం ఫార్మా యాజమాన్యాలకు అలవాటుగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఫార్మా వ్యర్థాలు బయటకు రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

తుది దశకు పోలీసుస్టేషన్ నిర్మాణ పనులు



నాతవరం, జూలై 9 : మండల కేంద్రం నాతవరంలో రెండు కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న పోలీస్టేషన్ భవన నిర్మాణపనులు ఎట్టకేలకు పూర్తి కానున్నాయి. గత ఆరు సంవత్సరాల క్రితం ఈ పోలీస్టేషన్ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనాయి. నత్తనడక సాగిన నిర్మాణ పనులు గత 5 నెలల నుంచి వేగంగా జరగటంతో ఈ పనులు చివరి దశకు చేరుకుంటున్నాయి. ఈ పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయి. స్టేషన్‌ను ప్రారంభిస్తే ఇక్కడ సిబ్బందికి వసతి సమస్య తీరనుందని వీరు చెప్తున్నారు.

చోడవరం
నియోజకవర్గం

కూర్మావతారంలో జగన్నాథుడు



చోడవరం, జూలై 8: జగన్నాథుని రథోత్సవాల సందర్భంగా దశ రూప మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతా రామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కూర్మావతారంలో ఉన్న స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు శ్రీనివాస్, ఉప్పల బాబు, వాణిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పోటీల్లో యోగాకు గుర్తింపు

▸▸ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్

చోడవరం, జూలై 9: భారత క్రీడల్లో యోగా 63వ క్రీడగా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంతో పాటు జాతీయ క్రీడల్లో యోగా పోటీలకు అవకాశం కల్పించడం పట్ల జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లేటి సతీష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఖేలో ఇండియో యూత్ పోటీల్లో యోగాకు అవకాశం కల్పించడంతో పాటు 2026 నిర్వహిస్తున్న ఏషియన్ గేమ్స్‌లో సైతం యోగాకు ప్రాతినిధ్యం కల్పించడం ఆనందదాయకమన్నారు. స్పోర్ట్సు కోటాలో సైతం యోగాకు అవకాశం కల్పించి యోగా క్రీడాకారులకు ప్రాధాన్యత ఇస్తున్న కేంద్రానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

భూ రికార్డులు మార్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోండి

రోలుగుంట, జూలై 9: మండలంలోని కుసర్లపూడి గ్రామ రెవెన్యూలో సర్వే నెం 739-1ఏలో ఉన్న 1.18 ఎకరాల సాగు భూమి రికార్డులను రెవెన్యూ అధికారులు మార్చేసి మరో వ్యక్తి పేరు మీద ఆన్‌లైన్ చేశారని కుసర్లపూడి గ్రామానికి చెందిన దళిత రైతు కంఠం దేముడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న 1.18 ఎకరాల భూమి తన తండ్రి కంఠం ముసలయ్య పేరున ఉందన్నారు. ఇటీవల ఆయన మరణించడంతో సదరు భూమిని తన పేరుమీద మార్చమని పలుమార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. ఇటీవల ఆసుపత్రిలో తాను వైద్యం పొందుతున్న సమయంలో సదరు రికార్డులను మఠం గంగయ్యమ్మ పేరున మార్చి తనకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధిత రైతు దేముడు వేడుకున్నాడు.

బైక్‌లు ఢీ : యువకుడికి గాయాలు

రావికమతం, జూలై 9: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో యర్రబంద గ్రామానికి చెందిన యువకుడు సంజయ్ (20)కు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సంజయ్ ద్విచక్ర వాహనంపై రావికమతం వెళ్లి పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో గుమ్మాళ్లపాడు పారమ్మ చెరువు మలుపు వద్ద కొమిర నుంచి ఎదురుగా వస్తున్న మరో యవకుడు ఢీకొట్టాడు. దీంతో బోల్తాపడ్డ సంజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో రావికమతంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అతనికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ధనుంజయనాయుడు చెప్పారు.

జలాశయంలో ఏమిటీ తుప్పలు..?

విష సర్పాలు కాటు వేస్తే ఎవరిది బాధ్యత?

ఏఈ జయరాంపై ఈఈ త్రినాథ్ ఆగ్రహం



ఎగువ కాలువ గేట్ల పక్కనున్న తుప్పలను పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం

చీడికాడ, జూలై 9: కోనాం జలాశయం చుట్టూ విపరీతంగా పేరుకుపోయిన తుప్పలను చూసి నీటిపారుదల శాఖ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఎ.త్రినాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. జలాశయాన్ని ఇరిగేషన్ శాఖ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ముందుగా ఎగువ కాలువ గేట్లను పరిశీలించిన ఆయన గేటుకు ఆనుకొని ఉన్న తుప్పలను, మెయిన్ గేటు మెట్ల పక్కన బురదమయంగా ఉన్న జలాశయం గట్టును చూసి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, జలాశయం చుట్టూ అస్తవ్యస్తంగా తుప్పలు, డొంకలు ఉన్నపుడు జలాశయానికి పర్యాటకులు వస్తున్న సమయంలో ప్రాణాంతకమైన విష సర్పాలు కాటు వేస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారని ఆ శాఖ ఏఈ సిహెచ్.జయరాం పడాల్‌ను ప్రశ్నించారు. జలాశయానికి వచ్చి ఏం పరిశీలిస్తున్నారని నిదీఆరు. వీటిని వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎగువ కాలువ గేటు నుంచి మెయిన్ గేట్లు వరకూ ఉన్న జలాశయం గట్టు అతి భయంకరంగా, బురదమయంగా ఉందని ఈఈ త్రినాథం మండిపడ్డారు. ఈ గట్టుపై గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో అంచానలు చేసి ప్రతిపాదనను తయారుచేసి తనకు పంపాలని ఏఈని ఆదేశించారు.



తుడుము వీధిలో చిత్తడిగా మారిన రోడ్డు

తుడుమువీధిలో అధ్వానంగా పారిశుధ్యం

మాడుగుల రూరల్, జూలై 9: మండల కేంద్రం మాడుగులలోని తుడుము వీధిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్డు ఛిద్రంగా మారింది. జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ఈ వీధిలో సీసీ రోడ్డు అంచులు తవ్వేసి తాగునీటి సరఫరా పైపు లైన్లు, కుళాయిలు వేశారు. అయితే తవ్విన ప్రదేశాన్ని సిమెంట్ కాంక్రీట్ వేసి పూర్తిగా పూడ్చకుండా వదిలేయడంతో వర్షాలు పడినా, కుళాయిలకు నీరు సరఫరా చేసినా రోడ్డుపై నీరు నిలిచిపోయి బురదమయమవుతోంది. వాహనాలు తిరిగేటప్పుడు ఛిద్రంగా మారుతున్నాయి. సోమవారం ఈ వీధి మార్గాన వారపు సంతకు పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మరింత ఛిద్రంగా తయారవుతున్నది. దీంతో అక్కడి నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు కూడా నడిచి వెళ్లేందుకు నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాతలక్ష్మీపురంలో క్షీణించిన పారిశుధ్యం



నర్సీపట్నం అర్బన్, జూలై 9 : మండలంలోని పాతలక్ష్మీపురంలో లో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడికక్కడే చెత్తచెదారంతో కాలువల్లో పేరుకుపోవడంతో మురుగునీరు విలయతాండవం చేస్తోంది. గ్రామంలో గల కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించకపోవడంతో ఇళ్ల వద్ద వాడుతున్న నీరు రోడ్లపై పారుతుతోంది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెత్త తడిచి కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దోమల బెడద కూడా అధికంగా ఉందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సమస్య పరిష్కరించాలని అధికారులను గ్రామస్థులు కోతున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు, జూలై 9: మండలంలోని కింతాడ పంచాయతీలో గంగా భవానీ భవన నిర్మాణ కార్మిక సంఘం, రావాలమ్మ తల్లి ట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. ఉచిత ఇసుక పాలసీ అమలు చేసినందుకు మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత ఐదేళ్లు సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా చేశారని, దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు, ఇల్లు కట్టుకునే పేదవాళ్లు చాలా ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు చంద్రబాబునాయుడు దయవల్ల ఇసుక ఉచితంగా వస్తున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కింతాడ పంచాయతీ భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ల సంఘాలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసం ఆవశ్యకతపై అవగాహన



పశుగ్రాసం విత్తనాలను అందిస్తున్న డీడీ నరసింహం

మాడుగుల రూరల్, జూలై 9: మండలంలోని ఎం.కోటపాడులో మంగళవారం పాడి రైతులకు పశుగ్రాసం ఆవశ్యకత పై అవగాహన కల్పించారు. పశు సంవర్ధక శాఖ పాడేరు డివిజన్ డీడీ నరసింహం పాడి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే రైతులకు పశుగ్రాసం విత్తనాలను అందించారు. సరైన పశుగ్రాసం మేతగా వేస్తే పాల దిగుబడి పెరుగుతుందని, పశువు ఆరోగ్యకరంగా ఉంటుందని చెప్పారు. డాక్టర్ మణి లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి



కోనాంలో బాలికలను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

చీడికాడ, జూలై 9: వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని చీడికాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు సూచించారు. కోనాం గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 250 మంది బాలికలకు తనిఖీలు చేయగా, ముగ్గురికి జ్వరాలు, 12 మందికి వివిధ వ్యాధులు ఉన్నట్టు గుర్తించి అందరికీ మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పి.పేరునాయుడు, ఏఎన్ఎం రాజేశ్వరి, వరలక్ష్మి సేవలు అందించాట.

మాడుగుల
నియోజకవర్గం

కె.కోటపాడులో ఉపాధి పథకం సామాజిక తనిఖీల ప్రజా వేదిక

కె.కోటపాడు, జూలై 9: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీల ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు తీరు, రికార్డుల నిర్వహణ బాగుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈజీఎస్ వేతన రూపంలో రూ.14.16 కోట్లు, పీఆర్‌కి సంబంధించి మెటీరియల్ రూపంలో 13.01 కోట్లు, ఫారెస్టుకు సంబంధించి రూ.8.96 లక్షలు ఖర్చు చేసినట్టు ఎస్ఆర్‌పీ రాజేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీడీవో పట్నాయక్, ప్రిసైడింగ్ అధికారి రోజారాణి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, ఏపీవో అప్పలరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసంతోనే అధిక పాల దిగుబడి

చీడికాడ, జూలై 9: నాణ్యమైన పశుగ్రాసంతోనే అధిక పాల దిగుబడులు వస్తాయని మాడుగుల పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) చిట్టినాయుడు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తునివలస గ్రామంలో రైతు పొలంలో నాణ్యమైన పశుగ్రాసం పెంపకంపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు విషయాలను వివరించారు. పశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సదస్సులో ఖండివరం పశు వైద్యాధికారి ఎ.గణేష్‌కుమార్, మాజీ సర్పంచులు పేరపు కొండబాబు, పడాల అప్పలనాయుడు, వీఆర్పీ పడాల శ్రీను, పాలసంఘం అధ్యక్షులు కొండబాబు, కె.చిన్నంనాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో వర్షం



మాడుగుల బస్టాండ్ ఏరియాలో కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్, జూలై 9: మండలంలో మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి కాస్త మబ్బు వాతావరణం నెలకొంది. ఉదయం తేలికపాటి జల్లులు కూడా పడ్డాయి. ఆ తర్వాత సాయంత్రం ఆరు గంటల వరకు పొడి వాతావరణం నెలకొంది. తర్వాత తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

రైతుభరోసా భవనాన్ని పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు

చీడికాడ, జూలై 9: మండలంలోని అప్పలరాజుపురం గ్రామంలో రైతుభరోసా కేంద్రం భవనాన్ని పంచాయతీరాజ్‌ శాఖ డీఈఈ రమణ, ఏఈ శరగడం పరదేశినాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణం పూర్తయిన ఆరు నెలల్లోనే బీటలు వారిందని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురచాస్వామి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు భవనాన్ని వెంటనే పరిశీలించారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.